క్లుప్తంగా

భగత్ సింగ్ వర్ధంతి సభ ఫ్లెక్సీ విడుదల



వర్ధంతి సభ ఫ్లెక్సీ విడుదల చేసిన నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): స్వాతంత్య్ర సమరయోధులు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల 93వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 23న సదస్సు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కళానీరాజనం, వంద మంది సోషల్ టీచర్లు, హిస్టరీ అధ్యాపకులకు అభినందన సత్కారాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఫ్లెక్సీని స్థానిక పవరుపేట అన్నే భవనంలో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి హేలాపురి బాలోత్సవం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా, గుడిపాటి నరసింహారావు, పి.ఆంజనేయులు, జి.శారద, ఎ.మోహిని, కె.శ్రావణి కుమారి, పి.సూర్యప్రకాష్‌రావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చీరల వేలం వాయిదా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పత్తేబాద నాలుగు గుడుల సెంటర్‌లోని కనకదుర్గమ్మవారి ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, రవికల ముక్కలను ఈ నెల 23న వేలం వేయనున్న సంగతి పాఠకులకు విదితమే. కాగా కొన్ని సాంకేతిక కారణాల చేత చీరల వేలం కార్యక్రమాన్ని వాయిదా వేసినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి వేలం ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

శనివారపుపేటలో పోషణ వేడుక



పోషణ వేడుకలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

ఏలూరు (టూటౌన్): ఏలూరు అర్బన్ ప్రాజెక్టు శనివారపుపేట పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం పోషణ వేడుక నిర్వహించారు. వెయ్యి దినములు జాగ్రత్తకు సంబంధించి గర్భిణులు, బాలింతల భర్తలకు పౌష్టికాహార ప్రాధాన్యత, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీడీపీఓ ఎ.పద్మావతి అవగాహన కల్పించారు. చాటపర్రు మెడికల్ ఆఫీసర్ అబ్దుల్లా పిల్లల పెరుగుదల, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సెక్టారు సూపర్‌వైజర్ బి.మంగ, ఏఎన్ఎంలు ఎస్ శ్రీదేవి, పి.ప్రభావతి, అంగన్‌వాడీలు పి.మార్తమ్మ, ఎం అన్నపూర్ణ, కె.నాగమణి, టి.సత్యవతి, కె.విజయకుమారి, ఆశావర్కరు మహిళా కార్యదర్శి కె.కావ్య పాల్గొన్నారు.

'అమ్మఒడి'తో పేదలకు అండ

- 15 గ్రామాల్లో 4,241 మందికి లబ్ధి
- నాలుగేళ్లలో తల్లుల ఖాతాల్లో రూ.19.14 కోట్ల జమ
- విద్యా వ్యవస్థకు అండగా నిలిచిన అమ్మఒడి పథకం



అమ్మఒడి పథకం అందుకున్న ఏలూరు రూరల్ గ్రామాల తల్లులు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తోన్న అమ్మఒడి పథకం గ్రామాల్లో పేదల చదువుకు అండగా మారింది. రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేదలకు వరమైంది. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతోన్న విద్యార్థుల తల్లులకు ప్రభుత్వం ఏటా రూ.15 వేలు అందిస్తోంది. ఇందులో రూ.2 వేలు ప్రభుత్వ పాఠశాల పరిశుభ్రతకు తల్లులు చెల్లిస్తున్నారు. మిగిలిన మొత్తంతో తమ బిడ్డల చదువు కోసం ఖర్చు చేస్తున్నారు. ఫలితంగా ఏ ఆటంకం లేకుండా పిల్లల చదువు కొనసాగడంతో పాటు పేద కుటుంబాలపై ఒత్తిడి తగ్గింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో 4,241 మంది తల్లుల ఖాతాల్లో రూ.19,14,86,931 జమచేసి పిల్లల చదువుకు అండగా నిలిచింది.

నాలుగేళ్లగా అమ్మఒడి లబ్ధి ఇలా..

ఏలూరు రూరల్ మండల 15 గ్రామాల్లో నాలుగేళ్లగా తల్లుల ఖాతాల్లో జమైన నగదు వివరాలిలా ఉన్నాయి. చాటపర్రులో 729 మంది విద్యార్థుల తల్లులకు రూ.3,25,55,48, పైడిచింతపాడులో 279 మందికి రూ.1,29,34,274, ప్రత్తికోళ్లలంకలో 412 మందికి రూ.1,80,93,096, కోటేశ్వరదుర్గాపురంలో 102 మందికి రూ.48,49,800, కోమటిలంకలో 127 మందికి రూ.54,12,133, శ్రీపర్రులో 528 మంది ఖాతాల్లోకి రూ.2,37,34,614 జమైంది. కొల్లేరు శివారు గ్రామం పెదయాగనమిల్లిలో 53 మందికి రూ.24,91,000, గుడివాకలంకలో 667 మందికి రూ.2,97,27,756, జాలిపూడిలో 501 మందికి రూ.2,27,93,823, మల్కాపురంలో 323 మందికి రూ.1,53,12,739, మాదేపల్లిలో 520 మంది రూ.2,35,84,948 అందుకున్నారు.

అమ్మఒడి మరువలేనిది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన అమ్మఒడి పథకం నాలాంటి కుటుంబానికి అండగా నిలిచింది. ఈ పథకం పేదలు ఎన్నటికీ మరిచిపోలేరు. గతంలో సంపాదించిన డబ్బు సగం పిల్లల చదువు కోసమే సరిపోయేది. కొన్నిసార్లు ప్రైవేటు స్కూల్ ఫీజులు కట్టలేక పిల్లలు బడికి వెళ్లేవారు కాదు. ఏడాదికి రూ.15 వేలు చొప్పున అందడం వల్ల పిల్లల చదువులు సాఫీగా సాగుపోతున్నాయి.

– ఎస్ వెంకటరమణ, కోటేశ్వరదుర్గాపురం

పేదలకు ఆదరణ



ముఖ్యమంత్రి ఏ పథకం పెట్టినా పేదలకు అండగా ఉంది. అమ్మఒడి పథకం ద్వారా నాలుగేళ్లలో రూ.60 వేలు అందుకున్నాను. ఇలాంటి పథకాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయి. ఇప్పుడు పిల్లల చదువుకు కోసం బెంగలేదు. పిల్లలు పెద్ద చదువులు చదివితేనే కదా, పేదల కుటుంబాలు బాగుపడతాయి. ఈ విషయాన్ని జగన్ గ్రహించి ఈ పథకం పెట్టారు. ఇప్పుడు ప్రభుత్వ బడులు సైతం బాగున్నాయి.

– బలే రాజేశ్వరి, పెదయాగనమిల్లి

ఆక్వారంగంలో నైపుణ్యం సాధించాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరాజు

ఏలూరు రూరల్ : ప్రభుత్వ సహకారంతో పాటు ఆక్వా రంగంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తే రైతులు ఆర్థికంగా బలపడతారని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం ఏలూరులో నిర్వహించిన ఆక్వా రైతులకు సాంకేతిక అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు ఆక్వా రంగంలో మరింత నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. అనేక రకాలైన పెస్టిసైడ్స్ అందుబాటులో వచ్చినప్పటికీ పలు రకాల తెగుళ్ల వల్ల రైతులు నష్టపోతున్నారని వివరించారు. వాతావరణ మార్పు, ఆక్వా సాగుపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆక్వా రంగ నిపుణులు కుప్పన్, ప్రవీణ్ మాట్లాడుతూ అనేక దేశాల్లో అమలౌతున్న బయోటెక్ విధానంతో ఆక్వా రంగంలో అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. బయోమీ సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రసిడెంట్ రాయప్రోలు చలపతి, ఏరియా మేనేజర్ మురళీరామ్మోహనరావుతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి



రక్తమార్పిడి చేసిన తలసేమియా బాధిత చిన్నారితో రెడ్‌క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైద్యులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తలసేమియా భవనంలో 12 మంది తలసేమియా బాధిత చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స చేసినట్టు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. తలసేమియా బాధిత చిన్నారులకు ప్రతి వారం క్రమం తప్పకుండా రక్తమార్పిడి ప్రత్యేకమైన ఫిల్లర్ సెట్లు ద్వారా చేస్తున్నామని వివరించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచామన్నారు. సరిపడా రక్త యూనిట్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. బుధవారం తలసేమియా చిన్నారులతో పాటు వారి సహాయకులకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు సీహెచ్ రత్నాజీ ఉచిత భోజనాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్ఎస్ఆర్కే వరప్రసాదరావు, డాక్టర్ పీఏఆర్ఎస్ శ్రీనివాస్, రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబి సీతారాం, గౌరవ కార్యదర్శి గడియాల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

జనార్ధనస్వామి తిరుకల్యాణ మహోత్సవాలు ప్రారంభం



విశేష అలంకరణలో జనార్ధనస్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారం శ్రీజనార్ధన, శ్రీ రంగనాయకస్వామి వార్ల దేవస్థానంలో స్వామివార్ల తిరుకల్యాణ మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం జనార్దన స్వామి సుప్రభాత గోష్ఠి ప్రతినిధుల ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, నిత్యార్చన, సేవాకాలం, ఆరగింపు కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవారికి, తాయార్లకు క్షీర తిరుమంజనం, స్వామివార్లను పెండ్లి కుమారులను, తాయార్లను పెండ్లి కమార్తెలను చేశారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సేవాకాలం, ఆరగింపు, రాత్రి మంగళాశాసనం, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. రాత్రి అర్చన, అంకురార్పణ, దీక్షధారణ, హోమాదులు నిర్వహించి మంగళాశాసనాలు పలికి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఆలయ అర్చకులు వంగల పవన్ కుమార్ అచార్య విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

25న శ్రీమహాలక్ష్మి యాగం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దొండపాడు శ్రీ నందత్తనాథ క్షేత్రంలోఫాల్గుణ శుద్ధ పౌర్ణమి, శ్రీ లక్ష్మీ జయంతి పర్వదినం సందర్భంగా క్షేత్రంలో శ్రీ మహాలక్ష్మీ యాగం వైభవంగా నిర్వహించనున్నట్టు క్షేత్రం వ్యవస్థాపక ట్రస్టీ వేణుగోపాల్ లునాని ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వర పూజ, మండపారాధన, అర్చన, సూక్త పారాయణ, మహాలక్ష్మి మంత్ర జపం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. భక్తులచే సామూహికంగా 100 సార్లు శ్రీ లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్ర పారాయణం చేస్తారని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి సౌందర్యలహరి పారాయణం, ఐదు గంటలకు లక్ష్మీ గణపతి, నవగ్రహ నక్షత్ర, మృత్యుంజయ హోమాలు, విశేషంగా మహాలక్ష్మి మూలమంత్ర హోమం అనంతరం మహాపూర్ణాహుతి నిర్వహిస్తారని వివరించారు.

మహిళల పట్ల అసభ్య సైగలు తగదు

- పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు ఆగ్రహం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఘంటా ప్రసాదరావు

దెందులూరు: మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అసభ్య సైగలు చేయడం టీడీపీ, జనసేన శ్రేణులకు తగదని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీకి వస్తోన్న జనాధరణను చూసి టీడీపీ, జనసేన శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయని ఆరోపించారు. ప్రజాప్రతినిధులైన జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం, సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మలు మంగళవారం రాత్రి మేము సిద్ధం.. మా గ్రామం సిద్ధం కార్యక్రమంలో తిమ్మన్నగూడెంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరితో కలిసి పాల్గొన్నారని చెప్పారు. ఆ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పిప్పర దుర్గా ప్రసాద్ మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అసభ్యంగా సైగలు చేయడాన్ని తప్పుపట్టారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అందరికీ నమస్కారం పెడితే తిరిగి కూర్చొని నమస్కారం చేసినందుకు తమపై దాడి, దౌర్జన్యం చేశారని టీడీపీ కార్యకర్త, నాయకులు బుధవారం ఉదయం నుంచి అసత్య ప్రచారాలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ చర్యలకు పాల్పడిన వ్యక్తులను వెనుక నుంచి ప్రోత్సహించడం చింతమనేని ప్రభాకర్‌కు తగదని హెచ్చరించారు. జెడ్పీటీసీ లీలా నవకాంతం మాట్లాడుతూ మహిళలమని కూడా చూడకుండా అసభ్యంగా చేతులతో సైగలు చేయడం తమను ఎంతో బాధించిందని, ఇలాంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేనలను శాశ్వతంగా ఇంట్లో కూర్చోబెడతారని హెచ్చరించారు. పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని మాట్లాడుతూ తమను వైఎస్సార్ సీపీ నాయకులు కొట్టారని, తిమ్మన్నగూడెం సభకు రాని నాయకుల పేర్లు పెట్టడాన్ని బట్టి ఈ ఘటనలో వాస్తవం ఇట్టే అర్థమవుతుందన్నారు. బ్యాండేజీలతో ముద్రగడ భరత్ అనే వ్యక్తి వీడియోలు చేసి అన్ని ప్రచార సాధనాలకు తప్పుడు సమాచారం అందజేశారని వివరించారు. ఆసుపత్రిలో ఉన్న బ్యాండేజీ ఉదయం గ్రామంలోకి రాగానే ఏమైందని ప్రశ్నించారు. బ్యాండేజీ ఉన్న ఫొటోను, గ్రామంలో బ్యాండేజీ తీసేసిన ఫొటోను నాని విలేకర్లకు చూపించారు. ముద్రగడ భరత్‌పై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు టూటౌన్ పరిధిలోని తంగెళ్లమూడి, చోడిదిబ్బ, కొత్తపేట ప్రాంతాల్లో గుర్తించిన సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో పోలీస్ సిబ్బంది, సాయుధ పోలీస్‌లు సీఐ ప్రభాకర్‌రావు, ఎస్సై మదీనా బాష ఆధ్వర్యంలో బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఐ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలన్నారు. మతపరమైన అంశాలలో రాజకీయ ప్రసంగాలు ఉండరాదని సూచించారు. ప్రజలు వారికి నచ్చిన రాజకీయ పార్టీపై అభిమానంతో ఎదుట పార్టీని విమర్శించరాదన్నారు. ప్రయాణ సమయంలో రూ.50 వేల కంటే ఎక్కువ నగదు కలిగి ఉంటే సంబంధించిన డాక్యుమెంట్లను కలిగి ఉండాలని అన్నారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ నిర్భయంగా ప్రలోభాలకు గురికాకుండా వినియోగించుకోవాలని సూచించారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పథకాలు



తోటగూడెంలో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న కొఠారు రామచంద్రరావు, నాయకులు

పెదపాడు : ప్రజలకు అక్కౌంటులోకి సుమారు రూ.3 లక్షల కోట్లు జమచేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ రైతు కమిటీ మాజీ అధ్యక్షుడు కొఠారు రామచంద్రరావు అన్నారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం కార్యక్రమం బుధవారం పెదపాడు మండలం తోటగూడెంలో నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సీఎం జగన్ ప్రతి ఇంటింటికీ పథకాల ద్వారా రూ.1 లక్ష నుంచి రూ.8 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. మరలా సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగన్మోహనరెడ్డిని ముఖమంత్రిని చేసుకోవాల్సిన అవసరముందన్నారు. సీఎం జగన్ నిలబెట్టిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కొఠారు అబ్బయ్యచౌదరి, కారుమూరి సునీల్‌కుమార్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కరోనా సమయంలో ఆశించిన స్థాయిలో ప్రభుత్వానికి రాబడి రాకపోయినా కేవలం మూడేళ్లలోనే ఇంత సంక్షేమం అందించారని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ డబ్బులు ఏమయ్యాయో ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అక్కినేని గోపిచంద్ర దుర్గాప్రసాద్, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, సర్పంచ్ ఏనుగ అబ్రహం, మాజీ సర్పంచ్ గరికపాటి పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	22	చామదుంపలు	60
వంకాయలు (తెలుపు)	00	ములక్కాడలు	05,07,10
బెండకాయలు	20	కంద	60
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	36
కాకర కాయలు	40	కీరా దోస	34
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	40	అల్లం	160
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34-40	పాలకూర	10
దొండకాయలు	22	చుక్కకూర	10
బంగాళదుంపలు	28	తోటకూర	10
ఉల్లిపాయలు	24-28	గోంగూర	08
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణీ	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	45
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	14
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	24
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు -తిరుపతి	16.00	4830	34

ఇంగ్లీష్ పరీక్షకు 4,232 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నియోజకవర్గంలోని 20 కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షకు 4292 మంది విద్యార్థులకు 4202 మంది హాజరయ్యారు. 90 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్‌గా రాస్తున్న విద్యార్థుల్లో 115 మందికి 30 మంది హాజరయ్యారు. 85 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు రూరల్ పరిధిలో చాటపర్రు హైస్కూల్‌లో 244 మందికి 221 మంది, ప్రైవేట్ విద్యార్థులు 17 మందికి 9 మంది, సత్రంపాడు హైస్కూల్‌లో 290 మందికి 285 మంది, శనివారపుపేట హైస్కూల్‌లో 227 మందికి 201 మంది, ప్రైవేట్ విద్యార్థులు 10 మందికి ఇద్దరు హాజరయ్యారు. గవరవరం శ్రీ చైతన్య స్కూల్‌లో ప్రైవేట్ విద్యార్థులు 27 మందికి ఏడుగురు పరీక్ష రాశారు. ఏలూరు అర్బన్ పరిధిలో సెయింట్ థెరిస్సా పాఠశాలలో 300 మందికి 297, కేపీడీటీ హైస్కూల్‌లో 239 మందికి 234, సుబ్బమ్మ దేవి హైస్కూల్‌లో 300 మందికి 295, సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్‌లో 300 మందికి 298 మంది హాజరయ్యారు. కేకేఆర్ గౌతం స్కూల్‌లో 236 మందికి 229, రవీంద్రభారతి స్కూల్‌లో 193 మందికి 188, ఏఆర్‌డీజీకే హైస్కూల్‌లో 230 మందికి 230, కస్తూరిబా బాలికోన్నత పాఠశాలలో 340 మందికి 338 మంది హాజరయ్యారు. గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో 319 మందికి 314, తూర్పువీధి శ్రీ కృష్ణ దేవరాయ మున్సిపల్ హైస్కూల్‌లో 290 మందికి 290, జేఎంజే ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 240 మందికి 239, అమలోద్భవి హైస్కూల్‌లో 340 మందికి 339 మంది, నారాయణ హైస్కూల్‌లో 204 మందికి 204, బాలగంగాధర్ తిలక్ స్కూల్‌లో ప్రైవేట్ విద్యార్థులు 15 మందికి 04 మంది, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రైవేట్ విద్యార్థులు 20 మందికి 03 మంది హాజరయ్యారు.

వ్యాయామ కళాశాలలో యోగా తరగతులు



ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో 45 రోజుల యోగా క్లాసులు ప్రారంభించామని ప్రిన్సిపాల్ ఎస్ సత్తానియేలు బుధవారం తెలిపారు. కళాశాలలో యూజీడీ, డీపీఈడీ కోర్సులు ఉన్నాయని, వాటితో పాటు విద్యార్థుల సంపూర్ణ, ఆరోగ్య పరిరక్షణ, మానసిక ఒత్తిడిని నివారించేందుకు యోగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 45 రోజులు సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించామని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, యూజీడీ, డీపీఈడీ విద్యార్థులు ప్రిన్సిపాల్‌ను సత్కరించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



గుడివాకలంకలో ఉపాధి పనుల మస్టర్లను పరిశీలిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ రాము

ఏలూరు రూరల్ : ఉపాధి హామీ పని ప్రాంతంలో తాగు నీరు, మెడికల్ కిట్లు, టెంట్లు అందుబాటులో ఉంచాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.రాము పరిశీలించారు. బుధవారం ఆయన ఏలూరు రూరల్ గ్రామం గుడివాకలంకలో ఉపాధి పనులు, కూలీల మస్టర్లను పరిశీలించారు. కూలీలకు కనీస వసతులు ఏర్పాటుచేయాలన్నారు. ఆయనతో పాటు ఏపీఓ కిషోర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ విజయ్ ఉన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

దెందులూరు: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని దెందులూరు అసెంబ్లీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి, పెదవేగి సీఐ కె.శ్రీనివాస్ అన్నారు. బుధ వారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కె.స్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, ఉమెన్ పీసీలతో శిక్షణ ఇచ్చారు. భారత ఎన్నికల సంఘం, పోలీస్ శాఖ నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.